కథానిక

# వోట్ల దొంగలు

ద్రోణంరాజు కృష్ణమోహన్

త్రివర్ణపతాకాలతో గాంధీ నెహ్రూ చిత్రపటాలతో, వూళ్ళోవాళ్లు, యితర చోట్లనుంచి వచ్చిన ప్రచారకులు-మొత్తం పాతికమంది ఊళ్లో చీకటి పడేవేళ వూరేగింపు లేవదీశారు. "ప్రజాస్వామ్యాన్ని రక్షించండి" "ఐక్యకాంగ్రెసుకే మీ వోటు" అనే కేకలు మైలు దూరం ఏ వైపుకైనా వినబడేట్లుగా వున్నాయి. ఒక్కొక్క ఇంటిదగ్గిరే ఆగి, ప్రముఖులు నలుగురైదుగురు లోపలికెళ్ళి ఎప్పుడూలేని వినయం, భక్తి, ప్రదర్శించి గృహస్థులను బ్రతిమిలాడుకుంటున్నారు. కొంచెం గట్టిగా ప్రశ్నించేవాళ్ళకి నచ్చజెపుతున్నారు. ఊరేగింపు కృష్ణయ్యగారింటి దగ్గిర ఆగింది. ముగ్గురు ప్రముఖులు లోపలికెళ్ళారు. కృష్ణయ్యగారిని వసారాలో చూసి వంగివంగి మరీ నమస్కరించారు.

"ఏం యింటింటికీ బయలుదేరారా ఏఁవిటి? గౌరవంగా ఆహ్వానించాడు కృష్ణయ్యగారు.

"మరేనండి. మీకు తెలియని దేముంది? ఎల్లుండేగా పోలింగూ! ప్రచారం చివరి ఘట్టంలో పడింది. అందుకని ఇంటింటికీ వెళ్ళి అడుగుతున్నాం" నాగయ్య సమాధానమిచ్చాడు.

"ఏఁవంత ఖర్మమొచ్చింది పాపం కాంగ్రెసుకి" వ్యంగ్యంగా అన్నాడు కృష్ణయ్య.

"వొచ్చింది మరి పంతులుగారూ. ఏంచేస్తాం! వీళ్ళతస్సాదియ్యా! ఈ కమ్యూనిస్టుల ప్రచారం మహా విజృంభించిందండీ. బలంకూడా సామాన్యం కాదు. అందుకనే దుంప తెగుతోంది మాకు" అన్నాడు నాగయ్య.

"అయితే యింతకీ వోట్లివ్వాలంటారు కాంగ్రెసుకి" కృష్ణయ్య తాపీగా చుట్ట వెలిగిస్తూ అన్నాడు.

"వేరే చెప్పుకోవాలిటండీ తమబోటి వాళ్ళతో! ఏదో అష్టకష్టాలుపడి తెచ్చుకున్న స్వాతంత్ర్యాన్ని చేతులారా యీ రాక్షసులకి అప్పజెప్పితే, ప్రజాస్వామ్యం నాశనమే గదండీ! మాట్లాడనిస్తారా గవర్నమెంటుకి ఎదురు? ఈ దెబ్బతో యీ కమ్యూనిస్టుల్ని అణగదొక్కెయ్యడానికి నాయకులంతా విభేదాలు సర్దుబాటు చేసుకున్నట్లే మనమంతా కూడా పరస్పరం సహకరించుకొని స్వార్థం చంపుకుంటేనే గదండీ దేశసౌభాగ్యం" చిన్న లెక్చరిచ్చాడు నాగయ్య.

"అసమాన త్యాగాలు చేసినవాళ్ళంతా మొదటినుంచీ కాంగ్రెసువాళ్లే గదండీ! ఉదాహరణకి నాబోటి చిన్నవాళ్ళని తీసుకోండి. నా మటుకు నేను రెండుసార్లు జైలుకెళ్ళిన సంగతి మీరెరిగినదే. మా చెల్లెలు చనిపోతే కనీసం ఒక్కసారి యింటికి కూడా వెళ్ళనివ్వలేదు గదండీ గవర్నమెంటు. ఎన్ని అవస్థలుపడ్డాను బ్రిటిష్‌హయాంలో! ఇప్పుడు చూడండి కాంగ్రెసు ప్రభుత్వం అందరికీ ఎంత స్వేచ్ఛయిచ్చిందో!" అంటూ ప్రజాస్వామ్యం గురించి వివరించాడు మోహనరావు.

"సరే మీరంతా గొప్పవాళ్ళేగాని, కోపం తెచ్చుకోకుండావుంటే రెండుమాటలు చెప్పనా?" చుట్టతీసి అన్నాడు కృష్ణయ్య.

"నిస్సందేహంగా అడగండి. ఇప్పుడే తీర్చుకోవాలి సందేహాలు. అందుకేగా మా యీ ప్రచారమంతా" సందేహ నివృత్తిచేయడానికి కాంగ్రెస్ హైకమాండ్ పనుపున వచ్చినవాడిలా ధీమాగా అన్నాడు శంకరరెడ్డి.

"మోహన్‌రావ్! నువ్వు అంతా కలిపితే సరిగా ఆరునెలలు కూడా జైలు జీవితం గడపలేదు. పైగా పెద్ద రాజకీయ బాధితుడనని చెప్పుకుంటూ, ఎన్నేళ్ళనుంచో మాలవాళ్లు సాగుచేసుకునే భూమి కాస్తా నీ పలుకుబడి, గవర్నమెంటు ఆర్డరు, ఆఫీసర్ల అండ, వూళ్ళో చీలికలు, ఆధారంగా చేసుకుని ఆ భూమి కాస్తా కాజేసి వాళ్ళనోట్లో మట్టికొట్టావే! న్యాయమేనా నీకు! పోనీ గర్భదరిద్రు

డివా అంటే అదీకాదు. వాడిజుట్టు వీడికీ, వీడిజుట్టు వాడికీ ముడిపెట్టి సంపాదించి మీతాత పోయేటప్పుడు పదివేలు మిగిల్చి నీ పేరవేశాడు. నీమామగారు కట్నం కింద నాలుగెకరాల సుక్షేత్రమైన మాగాణి నీ భార్య పేర వ్రాసిచ్చాడు వాళ్ళఊళ్లో. ఇవిగాక మీ నాన్నకట్టించి యిచ్చినఇల్లు, సంపాదించి వప్పగించిన ఆరెకరాల పొలం కూడా ప్రక్క ఊళ్ళోనేగదా వున్నది! ఇన్ని చాలకనా, పాపం ఆ మాలవాళ్ళు సాగుచేసుకునే 4 ఎకరాల భూమి కాజేశావ్!" అన్నాడు కృష్ణయ్య వుద్రేకంగా. మోహనరావు యిరుకులోపడ్డాడు. చప్పున తేరుకుని,

"పంతులుగారూ...అవన్నీ ఇప్పుడెందుకండీ. ఏవో అయిపోయాయిగా. ఇప్పుడు మనమంతా వొకటి. దేశం, జాతి, ప్రజాస్వామ్యం..." ఇంకా పూర్తికాక మునుపే కృష్ణయ్య అందుకుని,

"చాల్లేవయ్యా, దేశం, జాతి, అంటూ పెద్ద పెద్ద కబుర్లు చెపుతావ్!" విసురుగా అని, నాగయ్య వైపుతిరిగి, "నాగయ్యా! నేనంటున్నానని కోపం తెచ్చుకోకు. ఆ నాడు హైస్కూల్లో ఖాళీవొస్తే, ఎక్కడో తలిదండ్రుల దగ్గిరవుండి చిన్న వుద్యోగంతో కాలక్షేపం చేస్తున్న నీ మేనల్లుడిని పిలిపించి ఆ ఉద్యోగమిప్పించి దగ్గిరెట్టుకున్నావే! ఇదంతా కూతుర్నిచ్చుకున్నందుకేగా! 'ముసలివాడినై పోతున్నానయ్యా, కాస్త మా పెద్దబ్బాయికిప్పించవయ్యా మీ చౌదరిగారికి సిఫార్సుచేసి, యింటిపట్టున నన్ను కనిపెట్టుకుని వుంటాడయ్యా" అని ఎన్నిసార్లు నీ యింటిచుట్టూ తిరిగితే ఇదిగో, అదిగో, అని మొహం చాటెయ్యలేదు? చివరికి నీ మేనల్లుడికిప్పించుకున్నావ్. ఇదేగా పరస్పర సహకారం! స్వార్థరాహిత్యం! న్యాయం, దయ, అనేవి కొంచెమైనా చూపించలేకపోయావే! ఇప్పుడు ఇంట్లో నాలుగు ఓట్లుండే సరికి పరుగెత్తుకొచ్చారు గదూ! అహా!...మీ రంగయ్యమటుకు! వడ్డీలమీద వడ్డీలు పెంచి చెంచెయ్యనీ, సోమయ్యనీ, నాశనం చెయ్యలేదా? ఉన్న కొద్దిపాటి పొలం స్వాహా చేసుకున్నాడే! చివరికి పాపం గేదెల్ని, ఆవుల్ని, కూడా వేలం వేశాడే! ఎంత కర్కోటకుడయ్యా! అలాంటివాడు ఈనాడు తాలూకా మొత్తానికి గొప్పకాంగ్రెసు నాయకుడుగా చెలామణీ అవుతున్నాడు!" ఉన్న కోపమంతా వెళ్ళగ్రక్కాడు. నాగయ్యకు తెలుసు ఇలా అంటాడని. లేని చిరునవ్వు తెచ్చుకుంటూ,

"కోపగించుకోకండి. ఏదోకాస్త అలాంటి వాట్లల్లో స్వార్థం కొంచెమైనా లేకుండా వుంటుందా చెప్పండి. అయినా అప్పుడే అయిపోయినాయా మీతో పనులు మాకు, మాతో పనులు మీకూ? ఎన్నివుండవ్ తెల్లారిలేస్తే? రేపు మీ అబ్బాయి గొప్ప వుద్యోగస్థుడైతే నాకేదన్నా సహాయం చేయడూ అవసరమైతే? ఇవన్నీ బంధుప్రీతి, అవినీతి అంటామా? ఇలాంటి చిన్న చిన్న వాటికి జాతినీ, దేశాన్నీ, బలిచెయ్యడం సబబేనా చెప్పండి. ఏవో సర్దుకుపోవాలిగాని." అంటూ ఆయన చేయిపట్టుకుని "ఎలాగైనా తప్పదు. మరీ మరీ చెపుతున్నా. మీ యింట్లో ఐదువోట్లు కాంగ్రెసుకే" అని లేచి యివతల కొచ్చాడు. మిగతా ఇద్దరితో గుమ్మంలో "గాంధీగారికి జై!" అని నినాదాలు చేయించి, "మన కృష్ణయ్యగారి వోట్లు కాంగ్రెసుకే. పదండి చప్పున నరసయ్యగారింటికి." అంటూ దారితీశాడు.

* * *

మర్నాడు వీరమాత కోటమ్మ, వీరపత్ని కనకమ్మ మరో నలుగురు ఆడవాళ్ళతో, అరడజను మంది యువకులతో, పదిమంది పిల్లలతో ఎర్ర జండాలు పుచ్చుకొని, "భూస్వాముల కూటమి నశించాలి" "కాంగ్రెసుకి సమాధి కట్టాలి" అని మాస్కోదాకా వినపడేట్లు నినాదాలు చేస్తూ కృష్ణయ్యగారింటికి వొచ్చారు. కోటమ్మ, కనకమ్మ సరాసరి లోపలికెళ్ళారు.

"ఏమండోయ్ సీతమ్మగారూ" అంటూ వంట ఇంటికి కొంచెం యివతలగా నుంచున్నారు.

"ఆఁవొచ్చె." లోపల్నుంచి సీతమ్మ జవాబిచ్చి, ఇవతల హాలులోకొచ్చింది. వెంట వితంతు కుమార్తె జానకి కూడా వచ్చింది.

"ఏం యిలా వొచ్చారు? వోట్లా?" నవ్వుతూ అన్నది సీతమ్మ.

"ఇంకెందు కొస్తారూ?" జానకి అన్నది వెళాకోళంగా.

"మీకు నవ్వులుగానే వుంటాయిలెండి. ఎండలో కాళ్ళు కాలిపోతున్నా, వేళకి తిండిలేకపోయినా, ఊళ్ళన్నీ తిరుగుతున్నాం. ఎప్పటికైనా మన కమ్యూనిస్టు గవర్నమెంటొస్తేనే గదండీ మనకు మోక్షం. అందాకా జనానికి ముఖ్యంగా ఆడవాళ్ళకి, పిల్లలకి నరకమనుకోండి. మీరు కళ్ళారా చూసిందేగా...ఆయన్ని...మంచంమీద నుంచి పోలీసులు అర్థరాత్రివేళ బరబరా యీడ్చుకెళ్ళి వూరుబయట...తుపాకితో...హూఁ..." వీరపత్ని కొంగుతో కళ్ళు తుడుచుకుంటూ, వొచ్చే దుఃఖాన్ని దిగమ్రింగుతూ, "ఎంతఘోరం! ఆలోచించండి. పాపం ఆయన ఎవరి కపకారం చేశారు? పార్టీలో చేరడమే తప్పా? చెప్పండి" దీనంగా అన్నది సీతమ్మ వంకే చూస్తూ.

"నిజమే పాపం...మనం కళ్ళారా చూసిందే. పైగా పేపర్లో పచ్చి అబద్ధం వ్రాశారు! ఆయనే ముందు తుపాకి పేల్చాడని! అసలాయన దగ్గిర తుపాకీయే లేనిదే." అంటూ సానుభూతి ప్రకటించింది సీతమ్మ.

"అందాకా ఎందుకమ్మా ... నా బంగారం కొడుకుని, ఇంకో రెండు నెలల్లో పెళ్ళిచేద్దామని నేననుకుంటూంటే, అదేదో ఊళ్ళో రైలుకట్టమీద నిలబెట్టి క్షణంలో కాల్చేశారే! నా బంగారం నాయన నా కళ్ళముందు ఆడుతున్నాడు" భోరుమంది వీరమాత కోటమ్మ.

"మరే పాపం! చాలా సరదాగా వుండేవాడు. ఎప్పుడూ ఏవో పుస్తకాలు తెచ్చి పడేస్తూ వుండేవాడు చదువుకోమని" వోదార్చింది జానకి.

"అలాగేలెండి. ఏఁవుంది వెధవ వోటుముక్కేగదా భాగ్యం! ఇదేం కొరుక్కుతినేదా! సాటి ఆడవాళ్ళు వొచ్చి అడిగారు. కాదంటామా! చేతికిచ్చేదయితే, యిప్పుడే తీసుకుని యిద్దుము. ఇదేం అప్పా సొప్పా తిరిగి యిమ్మనడానికి" హామీనిచ్చింది సీతమ్మ.

"వోట్లబేరమా?" చెంబు గట్టుమీద పెడుతూ "ఇలా వరండాకి రండి" అని పిలిచాడు కృష్ణయ్య.

"వోట్లకోసమేనండీ. తప్పదుగా మరి! ఇంటింటికీ తిరిగి బ్రతిమాలుకోవాలి. ఈసారి తీవ్రంగా ఉంది పోటీ యిద్దరిమధ్యా. ఈ దెబ్బతో యిహ కాంగ్రెసంటూ వుండకూడదు. మన ఊళ్లో మీ కళ్ళముందు వాళ్ళ పోలీసులు చేసిన ఘోరాలు.." ఒక్కసారి కళ్లు తుడుచుకుంది వీరపత్ని. "ఊరుకో అమ్మా" వీరమాత దగ్గిరకి తీసుకుంది.

"ఘోరాలు ఎవరుచేసినా మరచిపోలేంలెండి" అన్నాడు కృష్ణయ్య ధైర్యంగా, నేర్పుగా.

"ఆఁహాఁ...పోనీ మేమేమన్నా ఘోరాలు చేశామా చెప్పండి"అందుకున్నాడు ఒకయువకుడు.

"ఎందుకయ్యా దాస్తారూ! కోపం రాదంటే చెపుతాను. ఆనాడు ఊళ్లో అర్థరాత్రి దొంగల్లాగా ముసుగులేసుకుని, గంతలు కట్టుకునివచ్చి సరాసరి బసవయ్య యింటిమీదపడి, చుట్టూ కాపలాపెట్టి, ఇల్లాంతా దోచుకుని, ఆడవాళ్లు, పిల్లలు భోరుమని ఏడుస్తూ కాళ్ళమీద పడుతున్నా లెక్కచెయ్యక బల్లెంతో ఆయన్ని పొడిచి చంపేశారే! ఇక్కడ యీ పని జరుగుతూ వుండగానే, యింకోమూల పెద్దరెడ్డి యింటిమీదపడి, ఆడవాళ్ళ నగలన్నీ వొలిచేసి, సొమ్మంతా జీపుకారుల్లో వేసుకుని ఉడాయించారే! అడ్డొచ్చిన చాకలి కాళ్ళు కాస్తా విరగగొట్టారే! "ఆగండి" అని కేకేసిన నన్ను, ఖాదిర్‌ను లోపలకన్నా రానివ్వకుండా తోసిపారేశారే! ఇదేనా మీ పరాక్రమం! ఆ రాత్రి పెద్దరెడ్డి యింట్లో వున్నట్లయితే తుపాకితో మిమ్మల్ని కాల్చెయ్యక పొయ్యేవాడా? ఊళ్ళో లేని సందుచూసి యింత ఘోరంచేశారే! ఇదంతా మరవగలమా..పోనీ ఆ సంగతి అలా వుండనివ్వండి. కేవలం కూలి జనంలో పలుకుబడి కోసం, అకారణంగా పాలేర్లందరిచేతా సమ్మెకట్టించి మాబోటి మధ్యతరగతి రైతులను నానాయిబ్బందులూ పెట్టి, బైట ఊరివాళ్ళని రానివ్వక, చివరకు బలవంతాన వొత్తిడిచేసి మాచేత కూలీరేట్లు హెచ్చింపజేసి, ఎన్నడూలేని కొత్త కొత్త రూల్సన్నీ మా నెత్తిన రుద్దారే! ఇవి మాత్రం మరవగలమా?" వుద్రేకంతో కృష్ణయ్య తను హృదయపూర్వకంగా విశ్వసించినదంతా పైకి చెప్పేశాడు.

"మీరు పొరబడుతున్నారు పంతులుగారూ. బసవయ్యచేసిన ఘోరాలు మీకు తెలియవు. అతను మధ్యతరగతి రైతేకావచ్చు. కాని మీలాగ వూరుకోక అనవసరమైన వాటిల్లో జోక్యం కలుగజేసుకున్నాడు. 150 ఎకరాల భూస్వామి పెద్దరెడ్డితో కలిసి నానాఘోరాలు చేశాడు. గవ

చిప్‌గా వెళ్ళి పోలీసులకి రిపోర్టిచ్చి మావారిని పట్టించి నిండుప్రాణాలు తీయించాడు. మాలపల్లె మీద పట్టపగలు దాడిచేయించాడు. పోలీసులు యిద్దరాడవాళ్ళని ఎంతఘోరంగా చెరిచారో మీకు తెలియదూ? కరణం రికార్డులో పెద్దరెడ్డి తనపేరు వ్రాయించుకుని, పొలం మాలవాళ్ళచేత సాగు చేయిస్తూ మీకే పట్టాయిస్తానని అంతా భుక్తం చేసుకున్నాడు. దీనికి ఎదురు తిరిగినందుకేనా యీ ఘోరాలు?" వీరపత్ని ప్రశ్నించింది.

"ఎదురుదెబ్బతియ్యడం మనలక్ష్యమన్నమాట!" కృష్ణయ్య అడిగాడు.

"ఖచ్చితంగా. రక్తానికి రక్తం కోరుతుంది మా పార్టీ" స్పష్టంగా జవాబిచ్చాడు మరో యువకుడు.

"ఇంతకూ బసవయ్య ఎందుకు పట్టించాడో మీకు తెలియకపోదు. వెనుక 1942 ఆగస్టు ఉద్యమంలో ఆయనతమ్ముడు పాపం యింట్లోదాక్కుంటే మీవాళ్లు పట్టించారు. మీరే స్వయంగా ఆ పని చేస్తే పరువు పోతుందని ప్రచారానికనే సాకుతో బైటవూళ్ళ కమ్యూనిస్టుల్ని పిలిపించి పట్టించి ఏమీ తెలియనట్టు నంగనాచిలా ప్రవర్తించారు. దానికి ఆయన పగతీర్చుకున్నాడు సరిపోయింది. ఇక పెద్దరెడ్డి చేసింది అన్యాయమేనని వొప్పుకొంటాను. కాని పిరికివాళ్ళలా అర్థరాత్రి ఆడవాళ్ళ మీద దాడిచేయడం గొప్పా? ఇక పాలేర్ల సమ్మె సంగతి చెప్పక్కర్లేదు" అన్నాడు కృష్ణయ్య.

"నిజంచెవుతున్నా వినండి. బసవయ్య తమ్ముడిని మావాళ్ళు ఎవరో పట్టించి యిచ్చారనడానికి ఏ మాత్రం ఆధారంలేదు. కేవలం మీకు అలా తోచింది. మీకేకాదు. జనానికంతా ఆనాడు అదేవిధంగా తోచింది. దానికి కారణం మీమీద నిర్బంధాలు తీసివేసి, వాటిని కాంగ్రెసువాళ్ళమీద ప్రయోగించడమే. మాకువున్న స్వేచ్ఛతో మేం కాంగ్రెసుకు వ్యతిరేకంగా ప్రచారంచేసేసరికి మీ అందరికీ అలా తప్పుఅభిప్రాయం కలిగింది. ఇక పాలేర్లసమ్మె అంటారా! అది తప్పనిసరి. ఎందుకంటే కరువుతో మాడిపోయేజనం. దొమ్మిలు, దోపిడీలు జరక్కుండా అలా శాంతంగా పరిష్కరించాం. మీతోపాటే మేమూ రేటు పెంచాం. వాళ్ళకంటె కాస్త వున్నవాళ్ళం గనుక త్యాగం చెయ్యక తప్పదు." సమర్థించింది వీరపత్ని.

"ఏమో మీరిచ్చామంటారు. మీరూ మీరూ ఒకటి. లోపల ఏం గూడుపుఠాణీజరిగిందో ఎవడికి తెలుసు? కూలీలు తలోవిధంగా చెప్పుకున్నారు. బసవయ్య తమ్ముడిని మీరు పట్టించింది ఖాయం. ఈ వూళ్లోపుట్టి, యీవూళ్లో పెరిగి, యీవూళ్లో చావడానికి సిద్ధంగావున్న నాకు కళ్ళుగప్పలేరు మీరెవరూకూడ...మధ్యతరగతి రైతుల్ని మీరు నానాఅవస్థలు పెడతారు. అదిమాత్రం ఖాయం. పైవాళ్ళకి డబ్బు, పోలీసుబలగం, అన్నీ అందు బాటులో వుంటాయి. క్రిందివాళ్ళని మీరేదో వుద్ధరిస్తామంటారు. ఎటొచ్చీ ఏబలంలేని మమ్మల్ని హతమార్చుతారు మీరిద్దరూకూడా. అందులో మీకు మధ్యతరగతిరైతులంటే, ప్రజలంటే చచ్చే మంట. సమిష్టి వ్యవసాయం పేరుతో వున్నకాస్తా కాజేస్తారు. అయినా యీ గ్రంథమంతా ఎందుకు లెండి. రాత్రికి మా రెండో అబ్బాయి, కోడలు వొస్తారు. ఇద్దరూ బాగా చదువుకున్నవారు. నాకు వూళ్లోరాజకీయాలు, చుట్టుప్రక్కల వూళ్ళల్లో మనుష్యులసంగతి తెలిస్తే, వాళ్ళకి దేశదేశాల రాజకీయాలు సిద్ధాంతాలు క్షుణ్ణంగా తెలుసు. అంతా సంప్రతించుకుంటాంలెండి. పాపం ఆడవాళ్ళు శ్రమపడి వొచ్చారు. మాట యివ్వలేనందుకు క్షమించండి" అన్నాడు.

"తప్పదులెండి యిహ. గతమంతా మరిచి పొండి. ఈ మూడేళ్ళలో పోనీ, మేమేమీ హత్యలు, దోపిడీలు చెయ్యలేదుగా. ప్రస్తుతం ధరలు బొత్తిగా పడిపోయాయి. మనకు కావాల్సిన ప్రాజెక్టులు నున్నచుట్టారు. మీరేపనిమీద బస్తీ వెళ్ళాల్సినా ఆఫీసుల్లో లంచాలు పోస్తేనేగాని పనులవవు. మీ అబ్బాయిలు ఎల్లకాలం మిమ్మల్నే కనిపెట్టుకుని యింటిపట్టున వుండాలంటే యీ కాంగ్రెసు గవర్నమెంటు పడనివ్వడంలేదు. కమ్యూనిస్టులు అధికారంలోకొస్తే యిలాంటివన్నీ మీకనుకూలంగా పరిష్కరిస్తాం. తప్పకుండా మాకే మీవోటు" మరీమరీ చెపుతూ గడపదాటారు వీరపత్నులు, వీరమాతలు, వగైరావగైరా బృందం.

ఆ రాత్రి కృష్ణయ్య కొడుకు రాజారావు, కోడలు లక్ష్మి వొచ్చారు. వాళ్ళవోట్లుకూడా అక్కడే వున్నాయి.